# సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com

ప్రచురణ: హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 41 ఎడిటర్ : పాలగోని రాజేష్ సోమవారం 06 మే-2025 పేజీలు : 8 వెల : 4-00










## రూపాయి అప్పుకూడా పుట్టని పరిస్థితి

**రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు-సమరం కాదు..సంయమనం కావాలి**

**మీకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం-కలసి పని చేస్తేనే తెలంగాణ బలపడుతుంది**

**ఉద్యోగ సంఘాల సమ్మె ప్రకటనలపై సిఎం రేవంత్**

హైదరాబాద్,మే5( :ఖజానా అంతంతమాత్రంగానే ఉన్నా..ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి.

2

## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

**-ఉద్యోగాల నియమకాలు..కొత్త బస్సుల కొనుగోళ్ల చేశాం**

**-అనేక బకాయిలను కూడా చెల్లించి మేలు చేశాం**

**-ఇప్పుడు సమ్మెతో మళ్లీ వెనకపడేయవద్దు**

**-ఆర్టీసీ కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం సూచన**



## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

**-ఇవన్నీ ప్రభుత్వ హత్యుగానే గుర్తించాలి-ఎక్కడా ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు**

**-అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనాలి-అందాలపోటీపై ఉన్న శ్రద్ధ రైతులపైనా పెట్టండి**

**-బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**



సిద్దిపేట,మే5( ): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యులని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటుని విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు

2

# రోడ్డు కనెక్టివిటీతోనే రాష్ట్రభివృద్ధి సాధ్యం

. ఇక్కడి ప్రజల సమస్యలు అర్థం చేసుకునే రోజు వచ్చిందని అన్నారు. పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని, రోడ్లు బాగున్న దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని అన్నారు. భద్రాద్రి, బాసర, మేడారం ఆధ్యాత్మిక క్షేత్రాలు హైవేతో అనుసంధానం చేస్తామని చెప్పారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తామన్నారు. నాగపుర్ నుంచి విజయవాడ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టినట్లు- తెలిపారు. జగిత్యాల- కరీంనగర్ హైవే విస్తరణ వేగవంతం చేస్తామని, వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులే దేశాభివృద్ధి అని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని చెప్పారు. రహదారులు మెరుగ్గా ఉండే దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ సందర్భంగా అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆదివాసీల జిల్లా ఇది అని కొనియాడారు. రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది. రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగ మార్గాలు నిర్మిస్తున్నాం. జోజిలా పాస్ టన్నెల్ వంటి నిర్మాణాలను చేపట్టాం. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నాం. నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్ చేపట్టాం. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుంది. భద్రాచలం, బాసర, మేడారం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను త్వరలోనే చేపడతాం. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాం. అంబర్‌పేట్‌లో నిర్మించిన పైవంతెనను ఇవాళే ప్రారంభించు కోనున్నాం. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. పెట్రోల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు ఇంకా పెరగాలి. వీటితో రవాణా ఖర్చు బాగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు. స్మార్ట్ సీటీలు కాదు...స్మార్ట్ విలేజ్‌లను తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో రెండులక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ కోసం రాబోయే రోజుల్లో లక్ష కోట్లు- ఖర్చు చేస్తామని చెప్పారు. గడ్చిరోలీ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. రైతులు ఆత్మహత్యచేసుకున్న విదర్భలో తాము పనిచేశామని చెప్పారు. చీకటి ఉండే చోట వెలుగులు నింపాలన్నారు. వెనుకబడిన జిల్లాలో అభివృద్ధి కోసం మేం పనిచేస్తున్నాం. అమృత్ సరోవర్ పేరుతో నీటి నిల్వలు పెంచుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే మేం నీటి నిల్వలు పెంచేందుకు సిద్ధం. తెలంగాణలో కూడా అలా నీటి సరస్సులను గుర్తిస్తే మేం అభివృద్ధి చేస్తాం అని గడ్కరీ హామీ ఇచ్చారు. మీ సమస్యలను అర్థం చేసుకునే అవకాశం వచ్చింది. రోడ్డు బాగుంటేనే అమెరికా ధనిక దేశం అయింది. తెలంగాణలో కూడా రోడ్లు బాగుంటేనే ధనిక రాష్ట్రం అవుతుందన్నారు. నీరు, ఇంధనం, రవాణా, కమ్యునికేషన్, ఏఐతో ఏ ప్రదేశమైనా అభివృద్ధి జరుగుతోంది. .శ్రీనగర్, జమ్మూలో36 టన్నెల్స్ నిర్మిస్తున్నాం. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం, ఆర్‌ఎస్‌ఎస్ లో ఉన్నప్పుడు ఆదివాసీలతో కలిసి పనిచేశాం. యువకులకు ఉద్యోగాలు, రైతులకు మద్దతు ధర దక్కాలి. జగిత్యాల వరంగల్ హైవేకు రూ.1000 కోట్లు- కేటాయించాం అని నితిన్ గడ్కరీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, బండి సంజయ్, కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపీ గోడం నగేశ్, వంశీ, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, పాల్వాయి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

ఈ సందర్భంగా రైతులను పరామ ర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అందాల పోటీలపై పోటీపడి సమీక్షలు నిర్వహిస్తున్న నాయకులకు, కొనుగోలు కేంద్రాల్లోనే కుప్పకూలుతున్న రైతన్నల గుండె కోత వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.సాగునీళ్లు అందించడంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కొనుగోలుచేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ధాన్యం కొనలేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తూ రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. ధాన్యం కుప్పలపైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూరు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో జలపతిరెడ్డి అనే రైతు మృతి చెందాడని, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో హనుమండ్ల ప్రేమలత అనే మహిళా రైతు హఠాన్మరణం చెందిందని, ఏప్రిల్ 22న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తికొనుగోలు కేంద్రంలో బిర్రు వెంకన్న ప్రాణాలు కోల్పోయాడని, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నేర్పుతూ చింతకింది హనుమయ్య కుప్పకూలాడని తెలిపారు. ధాన్యపు రాశులే సాక్ష్యంగా, కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఈ మరణాలకు బాధ్యులు అని అన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, వారి ప్రాణాల మీదకు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీళ్లు అందించడంలో వైఫల్యం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేయడంలో వైఫల్యం, కాంటాలు పెట్టడంలో వైఫల్యం, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం, బడాయిగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యమని హరీశ్‌రావు అన్నారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు ప్రాణులు కోల్పోతుంటే ఏం ముఖం పెట్టుకొని వేడుకలు చేస్తున్నారని ప్రశ్నించారు.

ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని హరీశ్‌రావు అన్నారు. ఒక వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పినందుకు, ఇంకెందుకో తెలియదు గానీ ప్రకృతి పగ పట్టినట్టుందని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని.. పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రహసనంగా మారిందని అన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు 10 రోజులు



దాటుతున్నా రైతులకు చెల్లించడం లేదని తెలిపారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయని అన్నారు. 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు 24.43 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. దీని విలువ రూ. 5664 కోట్లుత అని.. చెల్లించింది మాత్రం రూ. 3163 కోట్లు అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాహకుల అలసత్వం.. ఫలితంగా అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి వారాల కొద్దీ వేచి చూసినా కాంటాలు కావడం లేదని హరీశ్‌రావు తెలిపారు. టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో, అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని అన్నారు. వివిధ కారణాలు చెప్పి 5 కిలోల దాకా తరుగు తీస్తుండటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని చెప్పారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, తడిచిన ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం, పది రోజుల నుంచి కొనుగోలు ప్రక్రియ జరగడం లేదని విమర్శించారు. మార్కెట్లో వంద లారీలు ధాన్యం తడిసిపోయి ఉన్నాయని, వడ్ల కుప్పల మీదనే రైతులు ప్రాణాలు వదులుతున్నారని హరీష్ రావు అన్నారు. ఇప్పటికే ఐదుగురు రైతులు ధాన్యపు కుప్పల మీదనే ప్రాణాలు వదిలారన్నారు. ఇవి సాధారణ మరణాలు కావని, ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి రైతుల మీద లేదని విమర్శించారు. అందాల పోటీలు అన్నం పెడతాయా అని ప్రశ్నించారు. దేశంలో అత్యధిక పంట పండిందని గొప్పలు చెప్పడం కాదని.. రైతుల బాధలు పట్టించుకోవాలని హరీష్ రావు

ప్రభుత్వాన్ని కోరారు. పండిన పంటను కొనక రైతులను తిప్పలు పెడుతున్నారని.. అయితే డిల్లీకి.. లేకుంటే అందాల పోటీల రివ్యూలు... అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ.. రైతుల మీద లేకుండా పోయిందన్నారు. అకాల ఈదురు గాలులు, వర్షాలకు మామిడి కాయ లేకుండా మొత్తం రాలి పోయిందని అన్నారు. పత్తి రైతుల్ని కూడా ప్రభుత్వం ముంచిందని, పత్తి రైతులకు 20 శాతం మాత్రమే ఏంఎస్‌పికి తీసుకున్నారని.. మిగతా 80 శాతం బ్రోకర్లు, ప్రైవేటు మిల్లర్ల పాలు చేశారని విమర్శించారు. దాదాపు మూడు వేల కోట్ల నష్టం రైతులకు జరిగిందన్నారు.పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై సీబీఐ చేత విచారణ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 48 గంటల్లో వడ్ల పైసలు ఇస్తున్నామని చెబుతున్న మంత్రి నిరూపిస్తారా అని సవాల్ చేశారు. పది రోజులలోపు పైసలు రాడమే లేదన్నారు. బోనస్ అని గొప్పగా చెప్పి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా ఆగిపోయిందని.. తక్షణమే రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేవుడు, చర్చి, దర్గా మీద సీఎంకు నమ్మకం ఉంటే రుణ మాఫీ డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వానికి పరిపాలన సరిగా చేయడంలేదని, పాలన గాలిలో దీపంలా మారిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేల ఇన్పుట్ సబ్సిడీ అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇవ్వలేదు.. నాణ్యమైన కరెంటు ఇవ్వలేదు.. నీళ్లు ఇవ్వలేదు.. పండిన పంటను కూడా కొనడం లేదు అని విమర్శించారు. రుణమాఫీ జరిగిన రైతులు వివరాలతో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు- చేయాలని సూచించారు. 25 శాతం మందికి రుణమాఫీ చేసి పూర్తి రుణమాఫీ జరిగిందని ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని అన్నారు. మరికొన్ని చోట్ల దొంగల బెడద కూడా రైతన్నకు నిద్ర లేకుండా చేస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. ఇంటిని వదిలి, రోజుల తరబడి రైతులు వరి కుప్పలపై టార్ఫాలిన్ కవర్లు కప్పి అక్కడే కాపలా కాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతలకు కన్నీళ్లు పెట్టిస్తున్నదని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడం నిరాశలోకి నెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పత్తి రైతులకు ప్రభుత్వం మోసం చేసింని అన్నారు. ఈఈఒ అధికారులతో కలిసి పత్తి రైతులను ముంచి 3500 కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ పార్టీ ప్రశ్నించిన తర్వాత విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం సహా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు.

# ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్,మే5(ఆర్ఎన్ఎ):ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని... అభివృద్ధి విషయంలో కాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రాలఅభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ నమ్ముతారని అన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి అభివృద్ధిలో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం 5,100 కి.మీ.కు చేరుకుందని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి బోళ మంత్రి..మనసులో ఏమి ఉంచుకోడు.. ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మహారాష్ట్ర బార్డర్ లో నేషనల్ హైవేకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్. రూ. 3526 కోట్లతో 95 కిలోమీటర్ల మేర ఫోర్ లైన్స్ నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ అనగానే వెనుబడిన అనే అపోహ ఉండేది కానీ.. ఆదిలాబాద్ లో రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. అయితే ఆదిలాబాద్‌ను వెనకబడేశారని అన్నారు. గత పాలకులకు ఈ జిల్లాను పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాకముందు 2500కి.మీ రహదారులు హైవే ఉండేది. బీజేపీ అధికారంలోకి వచ్చాక 5100 కి.మీ నేషనల్ హైవేలు నిర్మించాం. దేశంలోని జాతీయరహదారుల కోసం లక్షా 20 వేల కోట్లు- కేటాయించాం. తెలంగాణకు కేంద్రం రూ. 12 లక్షల కోట్లు కేటాయించింది. రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలి. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం విశ్వ గురువు అవుతుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేసేందుకు కేంద్రం సిద్ధం. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే రహదారులు సరిగా లేవు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా నిర్మించేందుకు కేంద్రం రెడీగా ఉంది. రాజీవ్ రహదారి నిర్మించిన కాంట్రాక్టర్ సమస్యను పరిష్కరించాలి. రాజీవ్ రహదారిని మంచిర్యాల వరకు పొడించాలని కోమటిరెడ్డిని కోరారు. నితిన్ గడ్కరీ ఎవరు ఏది అడిగినా ఇస్తారని బండి సంజయ్ అన్నారు.

# ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

హైదరాబాద్,మే5(ఆర్ఎన్ఎ): కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సీసీఎస్, పీఎఫ్ పైసలు వాడుకున్నారని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసి గాడితో పడుతున్న సమయంలో ఆర్టీసీ సమ్మె ప్రతిపాదన సరికాదని అన్నారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామరెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్ , ఎస్టీఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరికృష్ణ, తదితరులు ఉన్నారు. ఆర్టీసీ సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ సంఘాల నేతలు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ సమస్యలపై ఉద్యోగులు ఎప్పుడైనా తనను కలవవచ్చని.. వారికి తానెప్పుడు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించడానికి తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం తమ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం , ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని..సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సమ్మె చేయొద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీ అభివృద్ధి కోసం 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామని.. ఒక్కరినైనా ఇబ్బంది పెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 ప్రకారం పే స్కేల్ 21 శాతం ఇచ్చామని..సంవత్సరానికి రూ.412 కోట్ల భారం తమ ప్రభుత్వంపై పడుతోందని చెప్పారు. పీఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1039 కోట్లు చెల్లించామని వెల్లడించారు. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ. 345 కోట్లు- చెల్లించామని అన్నారు. 1500 మందిని కారుణ్య నియామకాల కింద విధుల్లోకి తీసుకున్నామని వివరించారు. తమ ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను నియమించనుందని చెప్పారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని, తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసి కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడంతో స్పందించిన మంత్రి పొన్నం.. సమ్మె చేయొద్దని, చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్టీసి సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఆర్టీసి పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు.

కాగా, తెలంగాణ వ్యాప్తంగా మే 7 నుండి ఆర్టీసి కార్మికుల నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలసిందే. ఆర్టీసి పరిరక్షణ, విలీన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. మే 6 అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు బంద్ కానున్నట్లు కార్మికులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తోంది.

# రూపాయి అప్పకూడా పుట్టని పరిస్థితి

మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా.. సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాం లో సమయానికి జీతాలు రాకున్న నోరు విప్పలేదు.. ఇప్పుడు వాళ్ల అడగకముందే జీతాలు ఇస్తోన్న సమరం చేస్తామంటున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని సూచించారు. రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిన స్థితిలో ఉందని.. ఒక్కరూపాయి కూడా అప్పు పుట్టడం లేదని.. బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు- చూస్తున్నారని అన్నారు. అణాపైసా చిక్కడం లేదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి నెలకొందని.. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని తెలిపారు. సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టు-బడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటు-ంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు-, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229

మంగళవారం 06 మే-2025

## సంపాదకీయం

# సమగ్ర పంటల బీమాపై ఆలోచన చేయండి !

సోమవారం 5-5-2025

అకాల వర్షాలు మరోమారు తెలుగు రాష్ట్రాల రైతులను దెబ్బతీసాయి. పంటచేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బతినడంతో పంటలు నేలకొరిగాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు రాక..అప్పుల్లో కూరుకు పోతున్నారు. ఏలా ఇది జరుగుతున్న తంతే. వరి, బొప్పాయి, మామిడి, మక్కజొన్న తదితర పంటలు ఇలా దెబ్బతింటున్నాయి. అన్నదాతల పంటలసాగు జూదంలా మారింది. పంటలు దండిగా పండితే మద్దతు ధరలు ఇవ్వరు. పంటలు చేతికొస్తాయనుకుంటే వడగళ్లకు నేలరాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్ట పరిహారం కూడా ప్రహసనంగా మారింది. అధికారులు రావాలి..అంచనాలు వేయాలి...తరవాత అరకొ సాయం అందుతుంది. కొందరికి అదికూడా అందదు. ఇంతటి దౌర్భాగ్యంలో రైతులు ఉన్నా..ఊరడించే పాలకులు సకాలంలో సాయం చేసే చర్యలు తీసుకోరు. నిజానికి సమగ్ర పంటలబీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలి. ప్రీమియం ప్రభుత్వాలే కట్టుకుంటే..రైతులకు పంటనష్టపోయినప్పుడు నూటికనూరు శాతం నష్ట పరిహారం వచ్చేలా చేయాలి. అప్పుడు అన్నదాత నిశ్చితంగా పంటలు సాగుచేస్తారు. సమగ్ర పంటల బీమాతో రైతులను ఆదుకునేలా ప్రణాళికలను అత్యవసరంగా సిద్ధం చేయాల్సి ఉంది. మనిషికి, పశువులకు, వాహనాలకు, ఇళ్లకు బీమా చేస్తున్న పద్ధతిలోనే పంటల బీమాకు కూడా ప్రణాళిక చేయాల్సి ఉంది. ఇకపోతే ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించి.. వారంతా ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహిం చడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారక నిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారి పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కేవలం విదేశీ పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు మోకరిల్లుతున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు. రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం కదలడం లేదు. పంటల బీమా విధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకున్న వారు అవుతారు. ఇందుకు జాతీయ స్థాయిలో సమగ్ర బీమా పథకం అమలు చేయాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో బీమా వర్తించేలా చూడాలి. పంటనష్ట పోయిన రైతులు ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా లేదా..బిచ్చమెత్తుకునే ఉండే పరిస్థితులు పోవాలి. బీమా సొమ్ము దర్జాగా రాబట్టుకునేలా చట్టాలు రావాలి. అప్పుడే అన్నదాత కంటినిండా నిద్రపోగలడు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్ధిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాల వర్షాలు, వడగళ్లు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు, విలయం సంభవించి నప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పది శాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయక పోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఎప్పుడు ఎలా చెల్లించాలో గ్రామాల వారిగా వ్యవసాయాధికారులు దండోరా వేసి రైతుల దృష్టికి తీసుకుని రావాలి. బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్‌గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది సీజన్‌కు ముందే కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్క జొన్న, వేరుశనగ, శనగ పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంటరుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు కూడా బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది. మిర్చి,పత్తి,శనగ తదితర రైతులు నష్టం సంభవించి నప్పుడు ఏ విధంగా పరిహారం పొందవచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామిక వేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి. అప్పుడే దేశంలో రైతులకు భరోసా దక్కుతుంది. దీనిని అత్యవసర విషయంగా గుర్తించి రాష్ట్రాలు కూడా ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్రంతో చర్చిస్తే మంచిది.

# కౌలు రైతుల వరం అన్నదాత సుఖీభవ పథకం

**విధివిధానాలతో పాటు..అర్హుల గుర్తింపు ప్రక్రియ**

**ఈనెలలోనే ప్రారంభించేలా ప్రభుత్వం కసరత్తు**

అమరావతి,మే5

అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ఎపి లోని కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. కౌలు రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే ఈ పథకం ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దీనిని అమలు చేయబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది.. ఇప్పటికే పలు హామీలను అమలు చేస్తుండగా.. మే నెలలో మరో రెండు పథకాలను నెరవేర్చేందుకు సిద్ధమైంది. వీటిలో ముఖ్యమైనది అన్నదాత సుఖీభవ పథకం. దీనికింద ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున సాయం అందజేయనుంది. ఈ పథకాన్ని సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం అందించే రూ.20 వేలను.. మూడు విడతల్లో ఇస్తారు. ఈ రూ. 20 వేలల్లో పిఎం కిసాన్ పథకం కింద వచ్చే పథకం కింద ఇచ్చే రూ.6 వేలు కూడా కలుపుతారు. అటవీ భూములపై హక్కులు ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకానికి సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు రైతుల వివరాలను పరిశీలించి, అర్హుల జాబితాను తయారు చేస్తారు. ఈ నెల 20వ తేదీలోగా ఈ జాబితాను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. పూర్తి వివరాలు సేకరించిన తరవాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభించేందుకు సిద్దగా ఉన్నారు. ఈ పథకం అమలుకు సంబంధించి వ్యవసాయశాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. కాగా ఇప్పటికే మరణించిన లబ్ధిదారుల పేర్లను తొలగించడం, భూ రికార్డులకు అనుగుణంగా లబ్ధిదారుల నమోదు, రైతుల ఐడీ నంబర్లు, పెండింగ్‌లో ఉన్న ఆధార్, ఈకేవైసీ వివరాల సవరణ వంటి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. అటవీ హక్కుల చట్టం కింద హక్కులు పొందిన గిరిజనులకు, అలాగే ప్రత్యేకంగా గుర్తించబడిన అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలకు చెందిన అర్హుల ఎంపిక కోసం గిరిజన శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించింది.ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులకు ఈ పథకం వర్తించదు. ప్రస్తుత, మాజీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, శాసనసభ్యులు, మంత్రులు, శాసనమండలి సభ్యులు, మేయర్లు, జడ్పీ చైర్‌పర్సన్లు వంటి రాజ్యాంగ బద్ధ పదవులను నిర్వహిస్తున్నవారు, నిర్వహించినవారు అర్హులు కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మంత్రిత్వ శాఖలు, శాఖల కార్యాలయాల్లో, ప్రభుత్వ రంగ సంస్థలలో, స్థానిక సంస్థలలో శాశ్వత ఉద్యోగంగా పని చేస్తున్నవారు కూడా ఈ పథకం కింద సాయం పొందడానికి అనర్హులు. అలాగే నెలకు రూ.10 వేలు లేదా అంతకన్నా ఎక్కువ పెన్షన్ తీసుకునే వారికి కూడా పథకం వర్తించదు. అయితే, మల్టీటాస్కింగ్ స్టాఫ్, క్లాస్-4, గ్రూప్-డి ఉద్యోగులకు మాత్రం మినహాయింపు ఉంది. వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ఛార్టెడ్ అకౌంటెంట్లు-, ఆర్కిటెక్టులు, అలాగే ఇతర నమోదిత వృత్తి నిపుణులకూ ఈ పథకం వర్తించదని నిబంధనలు చెబుతున్నాయి. ప్రధానంగా కౌలు రైతులకు మేలు చేసేలా దీనిని రూపొందించారు.




# రాజీవ్ యువ వికాసం కింద లబ్దిదారుల ఎంపిక

**-కసరత్తు మొదలు పెట్టిన ప్రభుత్వం**

**-సిబిల్ స్కోరు ఆధారంగా లబ్దిదారుల గుర్తింపు**

హైదరాబాద్,మే5

రాజీవ్ యువవికాసం కింద అందించే రుణాలను జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెలాఖరుకు లబ్దిదారుల జాబితాను అంటే అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. మొదటి విడతలో సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు పొందాలంటే సిబిల్ స్కోర్ బాగుండాలి. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో రుణం పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే లేదా గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణాల దరఖాస్తులకు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా పరిశీలించనున్న బ్యాంకులు, దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేయనున్నాయి. ప్రతి దరఖాస్తుకు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666, ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీ-ల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుది జాబితా మే నెలాఖరులో అందుబాటులోకి రానుంది. మండల అధికారులు పరిశీలించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించి అర్హుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితా తయారైన తర్వాత అదే కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తారు.

# పెరుగుతున్న ఎండలతో జనం బెంబేలు



హైదరాబాద్,మే5

తెలంగాణలో ఎండల తీవ్రత పెరుగుతోంది. అప్పుడప్పుడు వానలు పడినా ఎండలు మాత్రం తగ్గేదేలే అన్నట్లు దంచికొడుతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా విజృంభించనున్నట్లు- వాతావరణ శాఖ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా.. మే 15 తర్వాత ఎండల తీవ్రత మరింత పెరగనుందని తెలిపింది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలకు తోడుగా 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని పేర్కొంది. 12 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని తెలిపింది. ఇక, ఈశాన్య తెలంగాణలో మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

# ఎండల తీవ్రతతో తగ్గిన కూరగాయల సాగు

**కూరగాయల ధరల్లో పెరుగుదల**

హైదరాబాద్,మే5

: మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీనికితోడు దిగుబడులు కూడా తగ్గాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.. అకాల వర్షాల వల్ల కూరగాయల దిగుబడి తగ్గింది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. అకాల వర్షాలతో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. బీర కిలో రూ.80కి పెరిగిపోయింది. అది రిటేల్ మార్కెట్లో వంద వరకు అమ్ముతున్నారు. అంటే రెట్టింపుయింది. బెండ కిలో రూ.రూ.60కి పెరిగింది. అది రిటేల్‌లో 20కి పావు కిలో అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలుదాదాపు రెండు రెట్లు పెరిగింది. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో అకాల వర్షాలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు.

# మంచివారితోనే స్నేహం మంచిది !

(ఆధ్యాత్మిక చింతన )

తిరుమల,మే5 :

మంచి వ్యక్తులతో స్నేహం... ఎప్పుడూ సత్యమే పలికేలా చేస్తుంది. బుద్ధి మాంద్యాన్ని తొలగిస్తుంది. జ్ఞానాన్ని పెంచుతుంది. సమాజంలో గౌరవాన్ని కలిగిస్తుంది. కల్మషాలను పోగొడుతుంది. మనసును నిర్మలంగా ఉంచుతుంది. పేరు ప్రతిష్టలు పెరిగేలా చేస్తుంది. మనోవికాసాన్ని కలిగిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే... సజ్జనులైన వారి సాంగత్యం సకలార్థ సాధనం అని పెద్దలు చెబుతారు. అలా ప్రతి ఒక్కరిని ప్రేమించగలగాలి. ప్రేమ అంటే ఇరువురు స్త్రీ పురుషుల మధ్య ఉండేదేనా, ఉద్భవించేదేనా? కాదు. ప్రేమకు పరిమితి లేదు. హద్దుల్లేవు. గోడలు, పై కప్పు, తలుపులు, తాళాలు... ఏమీ లేవు. స్వేచ్ఛగా, ఎప్పటికీ రెక్కలు తెగని పక్షిలా దిగంతాలకు, అనంతాలకు ఎగిరిపోయే ఒక అమృత కెరటం. అయితే అది అపురూపమైనదే గానీ ఎవరికీ అందుబాటులోకి రానిది మాత్రం కాదు. దాన్ని అందరూ అనుభవించవచ్చు. అనుభూతించవచ్చు. అదే దాని ప్రత్యేకత. నిజానికి ఈ లోకం ఇంత సజావుగా నడుస్తోందంటే దానికి కారణం, మూలం... ప్రేమే. ప్రేమ... భగవంతుడి ప్రతిరూపమే. ఆయన కల్యాణ గుణమేఇంత అద్భుతమైన ప్రేమను నిత్యజీవితంలో అనుభవిస్తున్న లోకం ఎంతో ఆనందంలో ఓలలాడాలి కదా... మరి ఈ దుఃఖం ఏమిటి, ఈ విషాదం ఏమిటి? మనుషుల్లోని స్వార్థం, మూర్ఖత్వం, దురాశ... ఈ దుర్గుణాలవల్ల వంచనకు గురవుతున్నామన్న సత్యం అమాయకులమైన మనకర్థం కాదు. అర్థమయ్యేసరికి మన జీవితమే ముగిసిపోతుంది.



## వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికమాజీ ఎంపిటిసి జ్యోతి అరవింద్ నాయక్

యాచారం సూర్య న్యూస్ (ఏప్రిల్ 05):. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మాజీ ఎంపిటిసి జ్యోతి అరవింద్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కార్యాలయంలో సాధారణంగా ఆహ్వానించి సాల్వాలు కప్పి ఆహ్వానించారు. మంతన్ గౌరెల్లి లో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు మెగావత్ వెంకటేష్, సప్పావత్ ప్రసాద్, సపావత్ మోహన్, తీగల శంకర్, కరెంటు రమేష్, కరెంటోత్ హతీరామ్, రాములు, దేవుజ, తేజావత్ నాన్ కు, కిరణ్, రాయమల్, పట్టాను సైధ, గంపెల్లి ఎల్లయ్య, రమణమ్మ, సంతోష్, రంగయ్య, రాము, శ్రీను, సఖ్య, గోపాల్, బాణావతి గోపాల్ చేరారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత న్యాయం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో యాట శ్రీను, రమావత్ శ్రీను, కనుక శ్రీను, రమేష్, శ్రీకాంత్, కిషన్, ఆర్ సింగ్, నవీన్, సుమన్, నక్క సత్యానంద్, పఠాన్ అఖిల్ నాయకులు తదితరు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ నూతన అధ్యక్షుడిగా రణధీర్ గౌడ్నియమించిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంత్తంగి రాజభూపాల్ గౌడ్



కొత్తూరు, సూర్య టుడే ( మే 5): కొత్తూరు మున్సిపాలిటీ బిజెపి పార్టీ నూతన అధ్యక్షుడిగా అమడాపురం రణధీర్ గౌడ్ ను రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంత్తంగి రాజభూపాల్ గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆముడపురం రణధీర్ గౌడ్ మాట్లాడుతూ..నాపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యత అప్పగించినందుకు నేను నా సాయశక్తుల సహకారం అందించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీకి పూర్తి సమయం ఇస్తానని తెలియజేస్తూ నా యొక్క నియామకానికి సహకరించిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజభూపాల్ గౌడ్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబాయ్య,బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్ గౌడ్, రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డీ, మహబూబ్నగర్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆముడపురం నర్సింహా గౌడ్ లకు నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

## ధర్మ రక్షణకు దయా, ప్రేమ, సత్యం, అహింసా, సోపానాలు- మాధవానంద సరస్వతీ స్వామి

(నారాయణఖేడ్:

ధర్మ రక్షణ కు దయా, ప్రేమ, సత్యం, శీలం, అహింసా విధానాలు సోపానాలని రాంపూర్ ఆశ్రమ పీఠాదిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ వచ్చిన సందర్భంగా సత్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో భకు లనుద్దేశించి మాట్లాడుతూ ప్రపంచానికి, పరమాత్మకు అనుసందాన కర్త ధర్మమే అన్నారు. ధర్మం అనేక స్వరూపాలుగా ఉంటుందని, అందులో మానవుడిగా ధర్మ రక్షణ కోసం కృషి చేయాల్సిన పాత్ర కీలకం అన్నారు. ప్రస్తుతం ధర్మానికి ఇబ్బంది కలుగుతుందని, కొన్ని శక్తులు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని, ప్రాణాలు సైతం పణంగా పెట్టిన మహానీయులు ఎందరో భారతభూమిపై జన్మించారని, అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో అనేకానేక దుర్మార్గ దుష్టులు విస్తరించే దశలో ఉన్నారని, అందువల్ల మనమందరం దైవ చింతనతో దైవ శక్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరమాత్ముడి కోసం ప్రతి రోజు ప్రేమతో ముందుకు సాగినప్పుడే ధర్మాన్ని రక్షించుకోగల్గుతామన్నారు. ఆయన వెంట సత్యనారాయణ స్వామి ఆలయ వ్యవస్థాపకులు చిన్నిమధుకర్, తదితరులు ఉన్నారు



# మున్సిపల్ కార్మికులు దేశవ్యాప్త సమ్మెలో విజయవంతం చేయాలి.

తుర్కయంజాల్, సూర్య టుడే:

కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి సిఐటియు ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా డి.కిషన్ మాట్లాడుతూ శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని అన్నారు కోడ్స్ గనుక అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందని కార్మికుల సమిష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం అవుతుందని ఉద్యోగ భద్రత ఉపాధి కోల్పోతారని అన్నారు కార్మిక శాఖ కూడా నిర్వీర్యం చేయబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు దేశంలోని కార్మికుల స్థితిగతులు అన్నింటిని సమీక్ష



చేసిన కేంద్ర కార్మిక సంఘాలు స్వాతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని ఆ పిలుపులో మున్సిపల్ కార్మిక వర్గం పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు యం. సత్యనారాయణ, జే ఆశీర్వాదం, బి మాల్యాద్రి, ఏ మాధవరెడ్డి మున్సిపల్ యూనియన్ నాయకులు చెక్క దయానంద్ ప్రవీణ్,సరిత,నాగమణి, తదితరులు పాల్గొన్నారు

# బిజెపి మండల అధ్యక్షులుగా జరుపుల విజయ నాయక్ ఎంపిక

**-మాజీ ఉపసర్పంచ్ గా అనుభవం -బిజెపిలో అసెంబ్లీ లీగల్ కన్వీనర్ గా బాధ్యతలు -వృత్తి:. న్యాయవాది గా సేవలు**

యాచారం సూర్య న్యూస్ ( ఏప్రిల్ 05):. మండల పరిధిలో తక్కలపల్లి తండ గ్రామపంచాయతీకి చెందిన జరుపుల విజయ నాయక్ ను బిజెపి మండల అధ్యక్షులుగా నియమించారు. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2020 సంవత్సరంలో బిజెపితో కార్యకర్తగా చేరి, పార్టీ నిబంధనల మేరకు పనిచేసే క్రియాశీలగా కార్యకర్తగా గుర్తింపు పొందారు. తక్కలపల్లి తండ గ్రామపంచాయతీకి ఉప సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లాల్లో బిజెపిలో అసెంబ్లీ లీగల్ సెల్ పదవి బాధ్యతలు నిర్వహించారు. వృత్తిపరంగా న్యాయవాది, తన వృత్తికి న్యాయం చేసుకుంటూ, బిజెపిలో నాయకుడుగా కొనసాగారు. బిజెపి పార్టీ ఆయనను గుర్తించి, గిరిజన సామాజిక వర్గానికి చెందిన విజయ్ నాయక్ మండల అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా నాయకులందరూ హర్ష వ్యక్తం చేస్తున్నారు. బిజెపిలోని అన్ని వర్గాలకు పదవులు పొందే అవకాశం ఉంటుందని తెలియజేశారు. యాచారంలో జనరల్ ఓసీలకు, బీసీలకు, ఎస్సీలకు, చివరికి గిరిజన సామాజిక వర్గాన్ని చెందిన వ్యక్తిని మండల అధ్యక్షుడుగా ఎంపిక చేయడం



బిజెపి పార్టీకి నియమ నిబద్ధత కలిగిన పార్టీ అని పార్టీ నేతలు చెప్పారు.

## కన్హా శాంతి వనంకు విచ్చేసిన కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి మరియు కిషన్ రెడ్డిను స్వాగతించిన శ్రీవర్ధన్ రెడ్డి అందే బాబయ్య

నందిగామ సూర్య న్యూస్ మే 5 నందిగామ మండల చేగూర్ గ్రామపంచాయతీ కన్హా శాంతి వనం లో నిర్వహిస్తున్న బయోకచర్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన బిజెపి కేంద్ర మంత్రివర్యులు నితిన్ గడ్కరి గారు మరియు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి, ఎంపీ డీ కే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిగార్లను జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ తో కలిసి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య ఘనంగా స్వాగతించారు. వారితో పాటు పి.విష్ణువర్ధన్ రెడ్డి, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్,అంజన్ కుమార్ గౌడ్, భూపాల చారి, వెంకటేష్ గుప్త,మనోహర్ రెడ్డి, యువ మోర్చా కార్యదర్శి ప్యాట అశోక్, విజయ్ కుమార్, అరవింద్ చారి, మల్చలం రాము, సుధాకర్ అప్ప, మహేందర్ రెడ్డి, శివలింగం, ప్రశాంత్ , గోవర్ధన్



రెడ్డి,తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు..

# విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

**మండల విద్యాధికారి పాండురంగ రెడ్డి -విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోవద్దు**

**-చింతపట్లలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం**




యాచారం సూర్య న్యూస్ ( ఏప్రిల్ 05):. విద్యాభివృద్ధి కోసం చేస్తుందని యాచారం మండల విద్యాధికారి పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలో చింతపట్ల ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా, తీవ్రమైన ఎండలు మండిపోతున్నాయని, పిల్లలు ఇతర ప్రమాదాలకు గురికా వద్దని ప్రభుత్వం చొరవతోని వేసవిలో ఉచితంగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ శిబిరంలో ముఖ్యంగా ఇంగ్లీష్, గణిత శాస్త్రం, డ్రాయింగ్, స్పోర్ట్స్, యోగ నేర్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పి అంజయ్య, పీఈటి మహమ్మద్ సాబేర్, శ్రీకాంత్ ను ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో జగన్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు

**-ఇద్దరు పిల్లలకు ఉరేసి..తండ్రి ఆత్మహత్య**

సంగారెడ్డి,మే5

: క్షణికావేశం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. కలహాల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తాను ఉరివేసుకుని తండ్రి సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి ఓనర్ కి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు లభ్యమయ్యాయి. భార్య మంజు(35) కి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతో గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగు తున్నాయని అరోపణపలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి సుభాష్(40) ఉంటున్నాడు. మానసిక వేదనకు గురైన సుభాష్ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. కుమారుడు రిథిక్ మర్యాన్(09), కుమార్తె ఆరా(05)కి ఉరివేసి...అనంతరం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డు. ముగ్గురి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కోలుకుంటున్న శ్రీతేజ్

**-పరామర్శించిన నిర్మాత అల్లు అర్జున్**

హైదరాబాద్,మే5 :

పుష్ప -2 రిలీజ్ రోజున సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్ ను అ÷-ల్లు అరవింద్ పరామర్శించారు. కొన్ని నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం శ్రీతేజ్ కొద్దీ రోజుల క్రితం ఆసుపత్రి నుండి డిశార్చి అయ్యాడు. అయితే శ్రీతేజ్ పూర్తిగా కోలుకునేందుకు మరి కొన్ని నెలలు పడుతుందని డాక్టర్లు వెల్లడించారు. అదే సమయంలో శ్రీతేజ్ ను రీహాబిలిటేషన్ సెంటర్ కు తరలించారు. ఈక్రమంలో సోమవారం శ్రీతేజ్ ను అల్లు అరవింద్ పరామర్శించారు. పునరావస కేంద్రానికి వెళ్లి డాక్టర్లను కలిసి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ 'శ్రీ తేజ్ కోలుకోవటం కోసం మా కుటుంబం అంతా ఎదురుచూస్తోంది. శ్రీతేజ్ రోజురోజుకు కోలుకుంటున్న విషయం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. శ్రీ తేజ్ చికిత్సకు సహకరిస్తున్నారు అని చెప్పారు డాక్టర్లు. ఇప్పటికే రూ. 2 కోట్లు- శ్రీతేజ్ అకౌంట్ లో డిపాజిట్ చేసాడు అల్లు అర్జున్. త్వరలోనే శ్రీ తేజ్ మనందరి మధ్య సాధారణల పిల్లల్లా ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అన్నారు.

## గల్ఫ్‌లో ఉద్యోగం అంటూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కే టోకరా

**-కన్సల్టెన్సీపై కేసునమోదు చేసిన పోలీసులు**

వేములవాడ,మే5

ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఓ మహిళ కాల్ చేసిన ఘటన హాట్ టాపిక్ గా మారింది. గల్ఫ్ లో మంచి ఆఫర్ ఉందంటూ ఎమ్మెల్యేకు ఓ కన్సల్టెన్సీ మహిళ ఫోన్ చేసింది. నువ్వు ఎవ్వరికి ఫోన్ చేశావో తెలుసా అంటూ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేతో మహిళ వాగ్వాదానికి దిగింది. మహిళ తీరుపై సదరు ఎమ్మెల్యే ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లక్ష్మి మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై జగిత్యాల పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. కన్సల్టెన్సీ మహిళ దుబాయ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లో మంచి ఆఫర్స్ ఉన్నాయంటూ పలువురికి ఫోన్ కాల్స్ చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మి మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ఎలాంటి లైసెన్స్ లేకుండానే విదేశీ బ్రోకరేజీ కన్సల్టెన్సీగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆఫీస్ సీజ్ చేసి, లక్ష్మి మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై కేసు నమోదు చేశారు

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

రాయికోడ్)

సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండల పరిధిలోని సింగీతం గ్రామం యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో పలువురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన రాయికోడ్ మండల తాజా మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ ఈ కార్యక్రమలో సింగీతం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాజిద్,రాయికోడ్ శ్రీ వీరబద్రేశ్వర టెంపుల్ మెంబర్ వీరేశం,మాజీ పిఏసిఎస్ సొసైటీ చైర్మన్ బాలయ్య,సీనియర్ నాయకులు రాజు కురుమ,మొహమ్మద్ రఫిక్ మియా,మొగులయ్య,సోషల్ మీడియా మోహన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# విజయలక్ష్మి హాస్పిటల్‌లో వైద్యం వికటించి కవల పిల్లలు మృతి

### -వాట్సప్ వీడియో కాల్ ద్వారా వైద్యం

### -నవజాత కవలపిల్లలు మృతి.లిహాస్పిటల్ ఫీజు 30 వేలు కట్టి వెళ్లాలని యాజమాన్యం డిమాండ్.

### -హాస్పిటల్ పై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బంధువుల డిమాండ్



.ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి ఏప్రిల్ 5ఇబ్రహీంపట్నం విజయలక్ష్మి హాస్పిటల్ లో దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని మంచాల రోడ్డులో గల విజయలక్ష్మి హాస్పిటల్ లో కాన్పు కోసం వచ్చిన పేషెంట్ కు అందుబాటులో లేని డాక్టర్ వాట్సప్ వీడియో కాల్ ద్వారా సిస్టర్ వైద్యం చేయడంతో వైద్యం వికటించి కవలపిల్లలు మృతి చెందారు. ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన బుట్టి గణేష్ కీర్తి దంపతులకు 6 సంవత్సరాల తర్వాత ప్రెగ్నెన్సీ రావడంతో ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి హాస్పిటల్ లో చూపించడం జరిగింది. ఆదివారం ఉదయం 4 గంటలకు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి పేషెంట్ ను తీసుకువచ్చామని భర్త గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే కవల పిల్లలు మృతి చిందినట్లు తెలిపారు. ఉదయం 4 గంటలకు డాక్టర్ కు సమాచారం ఇస్తే వాట్సాప్ వీడియో కాల్ ద్వారా సిస్టర్ రాజ్యలక్ష్మి కి చూపించడంతో సిస్టర్ వైద్యం చేయడం జరిగింది. వైద్యం వికటించి పిల్లలు చనిపోయిన తర్వాత 11 గంటలకు డాక్టర్ వచ్చారని




పిల్లలు చనిపోయిన కూడా 30 వేలు ఆస్పత్రి ఫీజు కట్టాలని ఆస్పత్రి యజమాన్యం తెలపడం బాధాకరంగా ఉందని, ఈ ఆస్పత్రిలో కనీస వస్తువులు, వసతులు కూడా లేవని ఇలాంటి సంఘటన మరెవరికి జరగకుండా విజయలక్ష్మి ఆస్పత్రి పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు

## నేరాల నియంత్రణలో నిఘానేత్రాల పాత్ర కీలకం -నాంపల్లి సిఐ రాజు.

చింతపల్లి,సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 5నేరాల నియంత్రణ, కేసులు ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని నాంపల్లి సిఐ రాజు అన్నారు. సోమవారం చింతపల్లి మండలం రోటిగడ్డ తండా లో గ్రామప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చింతపల్లి ఎస్సై బి. యాదయ్య తో పాటు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రాజు మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రిచ వచ్చున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని, గ్రామాల్లో విధిగా స్వీయ రక్షణ కోసం నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘీక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు. వారిని సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు, బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలేత్తితే డయల్ 100, షీటీమ్‌కు సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్ పద్మ ఫుల్ సింగ్ నాయక్, చింతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్



గుండ్లపల్లి నరసింహ్మరెడ్డి, కాసారపు మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు హరిప్రసాద్, కైలాస్, రవీందర్, గ్రామ పెద్దలు ,మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మార్క్సిజమే మహోన్నత మానవతా సిద్ధాంతం.

**సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు.**

(సంగారెడ్డి పెన్ గన్)

విశ్వ విఖ్యాత ఆర్థికవేత్త, శాస్త్రవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, మహోపా ధ్యాయుడు, గడచిన సహస్రాబ్దిలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రథముడుగా గుర్తించబడ్డ విశ్వ మానవుడు కారల్ మార్క్స్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద కారల్ మార్క్స్ 207వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.....ప్రపంచ మానవాళికి విముక్తి మార్గాన్ని చూపిన మహనీయుడు కారల్ మార్క్స్ అని ఆయన సిద్ధాంతం నేటికీ ఆచరణీయమని ప్రపంచంలో కార్మిక వర్గ శ్రమశక్తికి విలువ కట్టిన మేధావి అని కార్మికునికి యజమానికి ఉన్న సంబంధాలను విశదీకరించి చెప్పిన మహా నేత అని అన్నారు. కార్మిక వర్గం పట్ల పెట్టుబడిదారుల దుర్మార్గాలను గమనించి వారిని ఎదిరించడం కోసం




ఆనాడే ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని పిలుపునిచ్చాడని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో ఎదుర్కొంటున్న అనేక రకాల ఆర్థిక మాంధ్యాలను ఆనాడే అంచనా వేసి వాటికి పరిష్కార మార్గాలను కూడా చూపగలిగాడని తెలిపారు.

మార్క్స్ రచించిన పెట్టుబడి గ్రంథం ప్రపంచ మానవాళికి ఒక విముక్తి మార్గంగా ఉందని అన్నారు. నేటి పాలకులు పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ కార్మిక వర్గాన్ని, ప్రజలను బానిసత్వంలోకి నెట్టుతున్నారని అన్నారు. మార్క్స్ జీవిత చరిత్రను నేటితరం యువత చదివి నేర్చుకోవాలని మార్క్స్ చూపిన సిద్ధాంత ఆచరణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మార్క్స్ చూపిన మార్గంలో కమ్యూనిస్టులు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పేదవారికి ఉపాధి కల్పించబోతున్నాం

### -చిరు వ్యాపారులకు భద్రత కోసం షాపింగ్ మాల్స్-షాపింగ్ మాల్స్ నిర్మాణ పనులను పరిశీలించి ఎమ్మెల్యే

కావలి,

పేదవారికి ఉపాధి కల్పించాలని చిరు వ్యాపారులకు కట్టుదిట్ట మైన భద్రత కల్పించేందుకు మున్సిపాలిటి షాపింగ్ మాల్స్ నిర్మించి తక్కువ బాడుగకు ఇస్తున్నామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చెప్పారు. సోమవారంకావలి పట్టణంలో ని ఉదయగిరి రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ మల్స్ లను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డుకి ఇరువైపుల అనధికారికంగా చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. చిరు వ్యాపారుల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇరువైపులా షాపింగ్ మాల్స్ నిర్మించి తక్కువ బాడుగకు వారికీ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనివలన చిరు వ్యాపారులు ధైర్యంగా వ్యాపారాలు చేసుకోవచ్చని అన్నారు. ఉదయగిరి రోడ్లో మొత్తం 360 షాపులు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే త్వరలోనే ఆర్డిఓ, ఎమ్మార్వో కార్యాలయాల ముందు షాపింగ్ మాల్స్ నిర్మిస్తామన్నారు. అలాగే ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో కూడా షాపింగ్ మాల్స్ నిర్మించి



బాడుగకు ఇస్తామన్నారు. దీనివల్ల మున్సిపాలిటీకి ఆదాయం పెరగటంతో పాటు కావలి టౌన్ సుందరంగా ఉంటుందన్నారు. చిరు వ్యాపారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి మున్సిపల్ అధికారులు, పట్టణ టిడిపి అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



## ప్రజావాణి 55 దరఖాస్తులు

(సంగారెడ్డి

జిల్లాలో ప్రజల సమస్యలను పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 55 దరఖాస్తులు తమ సమస్యలు పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకొని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు అలాగే ప్రజల ప్రధాన సమస్యలు పూర్తి దృష్టి పెట్టి పరిష్కారాల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,డిఆర్ఓ పద్మజ రాణి ఆర్.డి. ఓ రవీందర్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థుల మూడు నెలల గ్రామీణ శిక్షణ ముగింపు

(జహీరాబాద్

జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు తమ గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమం లో భాగంగా వారి మూడు నెలల గ్రామీణ శిక్షణ ముగింపు సందర్భంగా రంజోల్ రైతు వేదిక



లో రైతు అవగాహన సదస్సు నిర్వహించి వివిధ స్టాల్ ఏర్పాటు చేశారు. తమకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందని ఇక్కడ సాగు చేసే పంటలు మరెక్కడా ఉండవని ఎక్కడ చూడని పంటలు ఈ జహీరాబాద్ కే సొంతమని కొనియాడారు. ఫల పరిశోధన కేంద్రం సంగారెడ్డి ప్రధాన శాస్త్ర వేత్త సుచిత్ర మాట్లాడుతూ ఇక్కడికి ఈ బ్యాచ్ 4వ బ్యాచ్ అని ఇప్పటి వరకు 200 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని వెళ్ళారు అని అదేవిధంగా తర్వాత వచ్చే వాళ్ళకి కూడా ఈ ప్రాంతానికి కేటాయిస్తామని తెలిపారు. అనంతరం ప్రతి విద్యార్థి 5 మట్టి నమూనాలు చొప్పున 200మట్టి పరీక్షలు చేసి భూసార పరీక్ష ఫలితాల కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఫల పరిశోధన కేంద్రం సంగారెడ్డి ప్రధాన శాస్త్ర వేత్త సుచిత్ర మాధవి లావణ్య నితీష్ ప్రొఫెసర్ నిరోష ఉద్యాన అధికారి మోనికా కే వి కే భూసార నిపుణులు స్వామి వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ విద్యార్థులు మహాలక్ష్మి సాత్విక వర్ష మానస ప్రియాంక యామిని జ్యోతి సప్న కాత్యాయని రవీనా రైతులు వీరారెడ్డి జగన్ కృష్ణ రాజు ఎల్లారెడ్డి సంజీవ్ రెడ్డి ఫిరోజ్ సంగప్ప రమేష్ రెడ్డి సంజీవ్ మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కును అందజేసిన తట్టు నారాయణ



(జహీరాబాద్

శాసనసభ్యులు కోనింటి మాణిక్ రావు ఆదేశాల మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్‌లి మండలం బూర్ధిపాడ్ గ్రామానికి చెందిన గుమ్మల్లా బాలరాజు అనారోగ్యంతో భాదపడుతూ.హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు , మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎమ్మెల్యే కృషి తో మంజూరైన రెండు లక్షల రూపాయలు ఎల్ ఓ సీ కాపీని భాధితునికి అందజేసిన జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ గ్రామ పార్టీ అధ్యక్షులు పెంటా రెడ్డి మాజి సర్పంచ్ అబ్రహం నాయకులు దత్తు రెడ్డి, పిజి శంకర్ తదితరులు ....ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మండల పార్టీ అధ్యక్షునికి , మాజి ఆత్మ చైర్మన్ పెంట రెడ్డి ,గ్రామ సర్పంచ్ గ్రామ బిఆర్ఎస్ నాయకులకు లబ్ధిదారుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు...

## ఖేడ్ నియోజకవర్గంలో వలసలు నివారించాలి: -సిపిఐ పార్టీ ఎమ్మెల్సీ నేలికంటి సత్యం

(జహీరాబాద్

నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసలు నివారించాలని సిపిఐ పార్టీ ఎమ్మెల్సీ నెలికంటి సత్యం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తమకు పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. సింగూరు జలాలు నారాయణఖేడ్ నియోజకవర్గానికి సాగుకు త్రాగుకు ఇవ్వాలని తెలిపారు. ఖేడ్ నియోజకవర్గాన్ని టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో అభివృద్ధిలో వెనుకకు నెట్టేసిందని తెలిపారు. నారాయణఖేడ్ లో ఆగస్టు 3న సిపిఐ పార్టీ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలలో ప్రధాన ఎజెండాగా నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటి నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, సహాయ కార్యదర్శి ఆనంద్ కార్యవర్గ సభ్యులు రెహమాన్ దత్తు రెడ్డి చిరంజీవి,అశోక్, పుప్పాల అశోక్, ఇసాక్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ యువ వికాసం ప్రత్యేక సమావేశం

(కంగ్టి,
సంగారెడ్డి, జిల్లా నారాయణఖేడ్, నియోజకవర్గం. మండల కేంద్రమైన, కంగ్టి లో సోమవారం,
రోజు రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా మండల కమిటీ బాధ్యులతో అలాగే పంచాయతీ కార్యదర్శులతో, రివ్యూ సమావేశం, నిర్వహించడం జరిగింది, మొత్తం,కంగ్టి మండలంలో అన్ని,కార్పొరేషన్ల లోన్, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో గాను, 1384 మంది అప్లై చేసుకున్నారు,వివిధ కార్పొరేషన్లకు సంబంధించిన,లబ్ధిదారుల అందరూ ఆన్లైన్లో, అప్లై చేసుకున్న, వారందరూ మాన్యువల్ గా అప్లికేషన్ ఫామ్ మండల ఆఫీసులో సబ్మిట్ చేయాలి, ఇప్పటికే చాలామంది సబ్మిట్ చేసి ఉన్నారు అన్నారు.చేయని వారు వారి పంచాయతీ కార్యదర్శి కి అప్లికేషన్ ఫామ్ ఇవ్వాల్సిందిగా కోరడం జరిగింది,అవసరమైన అన్ని సర్టిఫికెట్లు, క్యాస్ట్,ఇన్కమ్, రేషన్ కార్డు,ఆధార్ కార్డు, పాన్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్, అగ్రికల్చర్ రిలేటెడ్, యూనిట్లకు సంబంధించి భూమి పట్టా పాస్ పుస్తకం,బ్యాంక్ అకౌంట్ నెంబర్,పాస్పోర్ట్ సైజ్ ఫోటో, సమర్పించారా లేదా అని వెరిఫికేషన్ చేయడం జరిగింది,ఎవరైతే పైన పేర్కొన్న ధృవ పత్రములు సబ్మిట్ చేయలేధో వారి దగ్గర తీసుకోవాల్సిందిగా పంచాయతీ, సెక్రటరీనీ ఆదేశించడం జరిగింది,ఈ కార్యక్రమంలో కంగ్టి,బ్యాంక్ మేనేజర్, తడ్కల్,బ్యాంకు మేనేజర్,వాసర్, బ్యాంకు మేనేజర్,



ఏపీఎం, చంద్రశేఖర్ ఎస్సీ, కార్పొరేషన్ మండల కమీటి మెంబర్, రామస్వామి ఎస్టీ కార్పొరేషన్ మండల కమిటీ మెంబర్ బాలమనీ,ఎంపీడీవో సత్తయ్య,ఎంపీఓ సుభాష్,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగులకు వేసవి ఉచిత క్రీడల శిక్షణ శిబిరం

సిద్దిపేట,మే06(
తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ అలాగే సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యువజన అలాగే క్రీడ సంస్థ(సమ్మర్ శిక్షణ )వేసవిలో శిక్షణ నిర్వహించి,దానికి అనుగుణంగా మరో 22 శిక్షణ శిబిరాలను పట్టణ గ్రామీణ ప్రాంతాలలో మే నెల ఒకటవ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఉచితంగా నిర్వహించుచున్నది.క్రీడల్లో శిక్షణ తీసుకోవడానికి అర్బన్ లో రిజిస్టర్ వంద రూపాయలు రుసుము చెల్లించాల్సి ఉంటుంది,గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా నిర్వహించబడును.జిల్లా యువజన అలాగే క్రీడల సంస్థ శిక్షణ సెంటర్లో దరఖాస్తు చేసుకోవలెను.ఇతర వివరములకు 9014580816 నెంబర్ ని సంప్రదించగలరు.ఈ శిబిరంలో క్రీడల వివరములు వాలీబాల్,అథ్లెటిక్,హ్యాండ్ బాల్,ఖో ఖో ,ఫుట్బాల్,కబడ్డీ,జూడో,సాఫ్ట్ బాల్,బ్యాడ్మింటన్ కరాటే నిర్వహించబడును.



## ఘనంగా ప్రారంభమైన శ్రీ జగద్గురు రేవణ సిద్దేశ్వర స్వామి చండికాంబ మాత జయంతి ఉత్సవాలు



(ఝరాసంగం
ఝరాసంగం మండలం ఈదుల పల్లి గ్రామ శివారు లో వెలసిన శ్రీ రేవనా సిద్దేశ్వర స్వామి దేవాలయం లో శ్రీ జగద్గురు రేవణ సిద్దేశ్వర స్వామి చండికాంబ మాత సమేత జయంతి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ధ్వజారోహణం,శిఖర పూజ, కార్యక్రమాలు నిర్వహించారు ఇట్టి పూజ కార్యక్రమం లో శ్రీ చంద్రశేఖర శివచార్య మహాస్వామి బెమల్ ఖేడ్, బసవలింగ అవధూత గిరి మహరాజ్ , మాతృశ్రీ మఠం శివలీలమ్మ, రాచయ్య స్వామి, మాజీ ఎంపిటిసి శంకర్ పాటిల్, సిద్దయ్య స్వామి, నాగరాజ్ పటేల్,లింగం గౌడ్ , ఈశ్వరప్ప పాటిల్, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు అందజేశారు

## కూలీలకు ఉపాధి పని కల్పించండి.



కడియం, కడియం మండలం జేగురుపాడులో గ్రామీణ ఉపాధి హమీ పథకం కూలీలకు పని కల్పించమని కోరుతూ గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన జిపిఆర్ఎస్ లో ఎంపీడీవో కే రమేష్ కు వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమ గ్రామ ఫీల్డు అసిస్టెంట్ ను సస్పెండు చేసినట్లు తెలిసిందని, అప్పటి నుండి తమకు ఏ విధమైన పనులు కల్పించడం లేదని వాపోయారు. అయితే ఇటీవల కార్యాలయం నుండి టిఏ వచ్చి తమతో రెండు రోజులు పని చేయించారని, కాని ఆన్లైన్లో తమ హాజరు నమోదు కాలేదని పేర్కొన్నారు . అదేవిధంగా గతంలో తాము పని చేసిన రోజులకు ప్రతీ ఒక్కరికి పేస్లిప్ ఇచ్చేవారని, దానిలో తాము చేసిన పని దినాలు తెలిసేవని , కానీ ప్రస్తుతం పేస్లిఫ్ లు ఇవ్వడం లేదని , దీనితో తామునష్టపోతు న్నామన్నారు. పేద కుటుంబాల పోషణ కొరకు ప్రభుత్వం కల్పించిన ఈ పథకములో పని చేసిన కూలీలకు సుమారు రెండు నెలలు నుండి వేతనం అందక పోవడం అన్యాయం అన్నారు. రాజకీయ స్వార్ధ ప్రయోజనాలకు తమను బలిపశువులుగా చేస్తూ, తమకు పనులు లేకుండా చేస్తున్నారని, తమకు పని కల్పించవలసినదిగా కోరుతూ ఎంపీడీవో రమేష్ కు వినతి పత్రం అందజేసినట్లుగా వారంతా తెలిపారు.

### పంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకుడు

## సాయిరామ్‌కు ఘన నివాళులు

ఆలమూరు,
మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకులు నిమ్మకాయల సాయిరామ్ కు సోమవారం ఘన నివాళు లర్పించారు. రావులపాలెం మండలం గోపాలపురం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ఈయన ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన సంగతి తెలిసిందే. సోమవారం ఆయన స్వగృహం వద్ద జరిగిన సంస్మరణ సభలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆలమూరు, రావులపాలెం ఎంపీడీవోలు ఎ. రాజు, మహేశ్వర రావు, పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు నివాళు లర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ కొరకు దరఖాస్తుల ఆహ్వానం



(పుల్కల్ ప్రాంతీయ ప్రతినిధి
పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులందరూ తెలంగాణ ఆదర్శ పాఠశాల అండ్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కొరకు దరఖాస్తు చేసుకోవాలని పివి.కళ్యాణ్ చక్రవర్తి ప్రిన్సిపాల్, తెలంగాణ మోడల్ స్కూల్ %ఢ% జూనియర్ కళాశాల, బస్వాపూర్.పుల్కల్ ప్రిన్సిపాల్ పివి.కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. .ఆసక్తిగల అర్హులైన విద్యార్థినీ విద్యార్థులందరూ ఈనెల 20 వ తేదీ లోపు ఆన్ లైన్ విధానంలో వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొవాలని, ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని వారు సూచించారు.

# కరీంనగర్‌లో భూ ప్రకంపనలు.. పరుగులు తీసిన ప్రజలు..




(కరీంనగర్, మే 05
కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా భూప్రకంపనలు సంభవించాయి. జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ ప్రాంతాల్లో ఒక్కసారిగా భూమి కంపించింది. ధర్మపురి, సిరిసిల్ల, సుల్తానాబాద్?లోనూ ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై 3.5గా భూకంప తీవ్రత నమోదైంది. దాదాపు ఐదు సెకన్లపాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామగ్రి సైతం కదిలిపోవడంతో ఏ జరుగుతుందో అర్థంకాక భయంతో బయటకు పరుగులు తీశారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు నెలల వ్యవధిలో ఇలా భూమి కంపించడం రెండోసారి కావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరి ముఖ్యంగా చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాల్లో కొన్ని సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చాయి. అలాగే నిర్మల్ జిల్లాలోనూ పలు చోట్ల భూప్రకంపనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

## సిపిఎం ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఈ ఈ కి వినతిపత్రం



(సంగారెడ్డి
సంగారెడ్డి జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు, వాగులను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఈ ఈ భీమ్ కి వినతి పత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు కుంటలను కాపాడాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులు కుంటలు కబ్జా చేసి ఆక్రమించుకుంటున్న అధికారులు స్పందించటం లేదన్నారు. ప్రత్యేకంగా పటాన్చెరు నియోజకవర్గం అనేక చెరువులు ఆక్రమించి రైతులకి నష్టం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లకదారం, ఎర్దానూర్, మాదారం లలో క్రషేర్ లు చేరువులను నాశనం చేస్తున్నారు. అనేక చెరువులను కంపెనీల కాలుష్యం వల్ల పాడవుతున్నాయి. తక్షణమే కాపాడాలని కోరారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు యం. నర్సిములు, పి. కృష్ణ, రాజేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం




(సంగారెడ్డి
10వ తరగతి లోప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులను సన్మానించిన డాక్టర్ కూన వేణుగోపాలకృష్ణ, ఐసీ మోహన్ సోమవారం సంగారెడ్డి లోని నారాయణ స్కూల్ లో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థిని విద్యార్థులను మరియు వారి యొక్క తల్లిదండ్రులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ ఎంత కష్టమైనా బాధ అయినా దుఃఖం అయినా సరే అనుకున్న లక్ష్యాన్ని సాధించేంతవరకు విశ్రామించకుండా మీ యొక్క లక్ష్యసాధనలో ముందుకు సాగాలని అదేవిధంగా తల్లిదండ్రులు వారి యొక్క అభిరుచి తగట్టు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోని పిల్లలను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ యొక్క ఫలితాలు సాధించడానికి విశేషంగా కృషి చేసిన అధ్యాపక బృందానికి రుద్రాక్ష మాలలతో సన్మానించడం జరిగింది . అదేవిధంగా విద్యార్థులకు మేమోటోస్ ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో వల్లి కుమార్ లక్ష్మణ్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు

## బీసీ గురుకులాల్లో ఇంటర్మీడియట్ కొరకు దరఖాస్తుల ఆహ్వానం



(జహీరాబాద్/కోహిర్/ఝరాసంగం
పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులందరూ జిల్లాలోని 11 బీసీ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కొరకు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర పాఠశాల %ఢ% కళాశాల ఝరాసంగం -దిగ్వాల్ ప్రధానోపాధ్యాయులు హరీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఆసక్తిగల అర్హులైన విద్యార్థినీ విద్యార్థులందరూ ఈనెల 12వ తేదీ లోపు ఆన్ లైన్ విధానంలో https://mjpabcwreis.cgg% వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొవాలని, ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని వారు సూచించారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ రెడ్డి



(సంగారెడ్డి సంగారెడ్డి పట్టణం లో
కోహిర్ మండలం సజ్జా పూర్ గ్రామానికి చెందిన ఏసయ్య కుమారుడు యశ్వంత్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ రెడ్డి హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేసినారు మొదటగా సంగారెడ్డి లోని బి ఐ ఆర్ ఎం వ్యవస్థాపకులు పాస్టర్ జాన్ చేతుల మీదుగా ప్రార్థన చేసి గృహాన్ని ప్రారంభించారు. వారితో పాటు రిపోర్టర్ రాయికోటి నర్సిములు బంధువులు స్నేహితులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

# ఎస్ ఎస్ సీ పరీక్షలో కోహిర్ మైనార్టీ ప్రభంజనం

(కోహిర్
విడుదల చేసిన 2025 పది పరీక్ష ల్లో కోహిర్ మైనారిటీ విద్యార్థినిలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగురవేశారని పాఠశాల ప్రిన్సిపల్ ఆలియా ఫాతిమా తెలిపారు. అత్యధిక మార్కులు 552 వినీత, 552 మార్కులు జోష్న లు సాధించారు. ఇంతటి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలకు పాఠశాల ప్రిన్సిపాల్, అలియా పాతిమా ఉపాధ్యాయ బృందం అభినందించారు.



సాయి సూర్య
తెలుగు దిన పత్రిక



# శ్రీరామసేవక్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

గుడ్లూరు,
ఉమ్మడి ప్రకాశం జిల్లా గుడ్లూరు మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నేత్రపురి శ్రీరామ సేవక్ అధ్యక్షతన ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో జానకంపేట వాస్తవ్యులు వ్యాపార రీత్యా గుడ్లూరులో నివాసం ఉంటున్నటువంటి పూజిత మెడికల్స్ యజమాని మల్లెబోయిన మనోహర్ వారి జన్మదినాన్ని పురస్కరించుకొని వారి సహకారంతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది, ముందుగా మనోహర్ ఈ ఉచిత మజ్జిగను స్వయంగా వారే బస్టాండ్ లో ఉన్న ప్రయాణికులకు అలాగే పాదచారులకు వాహనదారులకు అందించారు. ఈ సందర్భంగా నేత్రపురి శ్రీరామ సేవక్ కార్యనిర్వాహకులు ఎయిర్టెల్ చిన్న మాట్లాడుతూ దాతల సహకారంతో వారానికి మూడు రోజులు ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేస్తున్నామని అలా కాకుండా ఎవరైనా దాత ప్రత్యేకంగా వారి కోరిన రోజు కూడా వారి సహకారంతో ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేస్తున్నామని, మజ్జిగ తాగిన ప్రతి ఒక్కరూ మనోహర్ బాబు చల్లగా ఉండాలని ఆశీర్వదించాలని కోరారు,మేము చేస్తున్న కార్యక్రమాలను సోషల్ మీడియాలో వైరల్ చేయటం ద్వారా ఆ



కార్యక్రమాలను న్యూస్ పేపర్ల ద్వారా చూసి ఈ కార్యక్రమలకు సహాయం చేసిన దాతలను ఆదర్శంగా తీసుకుని మరికొందరు దాతలు ముందుకు వస్తున్నారని తెలియజేశారు. మేము చేసే కార్యక్రమాన్ని ఇంతగా వైరల్ చేస్తున్న మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేస్తున్నామని అన్నారు, ఇలాంటి మంచి కార్యక్రమాలకు సహకరించే దాతలు అందరిని ఆ సీతారామాంజనేయ స్వామి చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నామని తెలియజేశారు. అలాగే ప్రతిరోజు ఉచిత కూలింగ్ మంచినీటి సౌకర్యం అందుబాటులో ఉంటుందని అలాగే. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ఒక రోజుకి 1100/ రూపాయలు అవుతుందని ఎవరైనా దాతలు ఇవ్వాలి అనుకుంటే మాకు 9949628842,9866625600 ఫోన్





చేయవలసిందిగా కోరుతున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో నేత్రపురి శ్రీరామసేవక్ కార్యనిర్వాహకులు ఇన్నమూరి. ప్రమీల సుధాకర్, ఎయిర్టెల్ చిన్న,,అలాగే ఆర్యవైశ్య పెద్దలు తుమ్మలపెంట కొండయ్య శెట్టి ,ఆమరా మాల్యాద్రి ఆర్యవైశ్య యూత్ అచ్యుతమణి, గుర్రం శశిధర్, పాజర్ల బ్రహ్మయ్య,వికాస్ సెట్ మరియు మల్లెబోయిన మనోహర్, రామిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు..



# ప్రతి ఒక్కరికి పని కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.



ఆలమూరు,
: పని కావాలి అని అడిగే కూలీలకు పని కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆలమూరు ఎన్డీఏ కూటమి నాయకులు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు గ్రామ మధ్యలో గల భవాని చెరువు పూడికి పోవడంతో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని ఉద్దేశంతో కూటమి నాయకులు అధికారులతో చర్చించి సుమారు రూ. 26.9 లక్షల వ్యయంతో 7 వేల పని దినాలతో కూడిన 279 మంది కూలీలతో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే పనులకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు అభివృద్ధితో పాటు వందలాది మంది కూలీలకు పని కల్పించడం జరుగుతుందని నాయకులు అన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పండగ మొదలైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జి అరుణ కుమారి, ఆలమూరు గ్రామ సర్పంచ్ ఎం లావణ్య కుమార్ రాజా, మాజీ ఏఎంసీ చైర్మన్ ఈదల నల్ల బాబు, ఈదల సత్తిబాబు, రామానుజుల శేషయ్య, బైరిశెట్టి రాంబాబు, కేతా రాంబాబు, చల్ల బాబి, కట్ట రాజు పలువురు ఎన్డిఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మాపొలాలకు దారి చూపించండి

### - సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన గనిపినేని వెంకటేశ్వర్లు

కందుకూరు,
గుడ్లూరు మండలం పూరేటిపల్లి గ్రామ రైతులు తమ పొలాలకు వెళ్ళేందుకు వీలు లేకుండా దారి మూసివేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ పొలాలకు దారి చూపించండి అంటూ గనిపినేని వెంకటేశ్వర్లు అనే రైతు సిపిఐ ఆధ్వర్యంలో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీ పూజ కు సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూరేటిపల్లి గ్రామ సర్వేనెంబర్ లో 283 పొలంలో నుండి పై ఎత్తున ఉన్న రైతులు పండించిన పంటను వారి పొలం లోని దారి గుండా రహదారి మీదకు తీసుకొచ్చేవారు అని, అయితే 283 సర్వే నెంబర్లు భూమిని ఒంగోలుకు చెందిన మాలకొండయ్య కొనుగోలు చేయడం ద్వారా ఆ భూమిలో ఉన్న రాకపోకల దారికి కంచి వేయడంతో పై ఎత్తున ఉన్న రైతులు పంటను రహదారి మీదకు తీసుకురాటానికి ఇబ్బందిగా ఉందని అన్నారు. ఆదివారం రాత్రి గాలితో కూడిన వర్షం రావడంతో పత్తి రైతులు తీవ్ర ఆందోళనకు గురి అయ్యారని ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు రోడ్డును చూపించవలసిందిగా కోరుతున్నామని ఆయన అన్నారు. గత 40 రోజుల కిందట సబ్ కలెక్టర్ ఇదే విషయమై అర్జీ ఇవ్వటం జరిగిందని గుర్తు చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. ఇప్పటికైనా సబ్ కలెక్టర్ స్పందించి మా



సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కందుకూరు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, పూరేటిపల్లి గ్రామ రైతులు ఉన్నారు.

# గ్రామాల్లో మొదలైన అభివృద్ధి పండుగ.



ఆలమూరు, : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెప్పినదే చేస్తుందని దీంట్లో భాగంగానే ప్రతి గ్రామంలో అభివృద్ధి పండగ మొదలైందని ఆలమూరు మండలం మడికి గ్రామ టిడిపి అధ్యక్షుడు దొండపాటి సుబ్బరాజు పేర్కొన్నారు. గ్రామంలోని కొన్ని ప్రధాన రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి అభివృద్ధికి సహకరించాలని మడికి గ్రామానికి చెందిన నాయకులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కోరడంతో నాయకుల అభ్యర్థనను స్వీకరించి మడికి గ్రామంలో ఎమ్మెల్యే బండారు ఇటీవల పర్యటించి శిథిలావస్థకు చేరిన రోడ్లను పరిశీలించారు. మడికి కృష్ణ మందిర్ రావి చెట్టు వద్ద నుండి చిలకలపాడు మీదుగా గాంధీనగరం వరకు రోడ్లు అభివృద్ధికి సుమారు రూ. 1.14 కోట్లతో నాబార్డు ద్వారా నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరుకు కృతజ్ఞతగా మడికి గ్రామానికి చెందిన నాయకులు కొత్తపేటలో ఎమ్మెల్యే బండారు క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లుగా గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, గ్రామంలో అభివృద్ధి పండగ మొదలైందని ఎమ్మెల్యే వద్ద నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మడికి గ్రామానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



# ఏ పి టి ఎఫ్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కావలి,
ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏ పి టి ఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు పాత తాలూకా కేంద్రాలలో నిరసన కార్యక్రమం లో భాగంగా సోమవారం రోజు కావలి ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఉపాధ్యాయుల బదిలీలు మరియు రియపోర్న్సమ్మెంట్, పిఆర్సి లో భాగంగా ఇంటీరియం రిలీఫ్ ఇవ్వడం మరియు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి అనేటువంటి ప్రధాన డిమాండ్స్ సాధనలో భాగంగా ఈ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల తహసీల్దారు శ్రావణ్ కుమార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బెల్ల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క పాఠశాల ని ఒక్కో విధంగా పరిగణలోకి తీసుకుంటూ ఉపాధ్యాయుల కేటాయింపులో అన్యాయంగా వ్యవహరిస్తూ పాఠశాల పాఠశాలకి ఒక్కొక్క నియమాన్ని పెడుతూ ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేస్తుంది అని విమర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథరెడ్డి ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కావలి ప్రధాన కార్యదర్శి బి మధుసూదన్ రావు ,కె రఘునాథరావు, పెంచలయ్య, రమణ కుమార్ ,సమాధి వెంకటేశ్వర్లు, కావలి టౌన్ అధ్యక్షులు లక్ష్మయ్య, రాజయ్య ,ఏ వెంకటేశ్వర్లు, ఏ జగన్నాథ్ ,ఈ సురేష్ రాజేష్ మరియు కావలి, బోగోలు, జలదంకి ,కావలి టౌన్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియు ఏపీటీఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# కూలీలకు ఉపాధి పని కల్పించండి.

కడియం, : కడియం మండలం జేగురుపాడులో గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పని కల్పించమని కోరుతూ గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన జిపిఆర్ఎస్ లో ఎంపీడీవో కే రమేష్ కు వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమ గ్రామ ఫీల్డు అసిస్టెంట్ ను సస్పెండు చేసినట్లు తెలిసిందని, అప్పటి నుండి తమకు ఏ విధమైన పనులు కల్పించడం లేదని వాపోయారు. అయితే ఇటీవల కార్యాలయం నుండి టిఏ వచ్చి తమతో రెండు రోజులు పని చేయించారని, కాని ఆన్లైన్లో తమ హాజరు నమోదు కాలేదని పేర్కొన్నారు . అదేవిధంగా గతంలో తాము పని చేసిన రోజులకు ప్రతీ ఒక్కరికి పేస్లిప్ ఇచ్చేవారని, దానిలో తాము చేసిన పని దినాలు తెలిసేవని , కానీ ప్రస్తుతం పేస్లిఫ్ లు ఇవ్వడం లేదని , దీనితో తామునష్టపోతు న్నామన్నారు. పేద కుటుంబాల పోషణ కొరకు ప్రభుత్వం కల్పించిన ఈ పథకములో పని చేసిన కూలీలకు సుమారు రెండు నెలలు నుండి వేతనం అందక పోవడం అన్యాయం అన్నారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు తమను బలిపశువులుగా చేస్తూ, తమకు పనులు లేకుండా చేస్తున్నారని, తమకు పని కల్పించవలసినదిగా కోరుతూ ఎంపీడీవో రమేష్ కు వినతి పత్రం అందజేసినట్లుగా వారంతా తెలిపారు.

# పంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకుడు సాయిరామ్‌కు ఘన నివాళులు



ఆలమూరు,
మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకులు నిమ్మకాయల సాయిరామ్ కు సోమవారం ఘన నివాళులర్పించారు. రావులపాలెం మండలం గోపాలపురం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ఈయన ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన సంగతి తెలిసిందే. సోమవారం ఆయన స్వగృహం వద్ద జరిగిన సంస్మరణ సభలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలమూరు, రావులపాలెం ఎంపీడీవోలు ఎ. రాజు, మహేశ్వర రావు, పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

# తటవర్తి ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు "ప్రతిభా పురస్కారం" అవార్డులు ప్రధానం

కావలి
ఆదివారం కావలి మండలఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షులు "తటవర్తి రమేష్ ఆయన సతీమణి శిరీష" ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు( 580పైబడిన )సాధించిన విద్యార్థి,విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి అన్నదాత "ప్రాసమణి" పాల్గొని టెన్త్, ఇంటర్ ,20 మంది విద్యార్థులకు శాలువా కప్పి, షీల్డ్ లను,గిఫ్టులు అందజేసి సన్మానించారు. తటవర్తి రమేష్ ఆర్యవైశ్యలకు చేస్తున్న సేవలు గురించి కొనియాడారు. ఆర్థిక స్తోమత లేని పేదఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నతచదువు కోసం అండగా ఉంటామని తట వర్తిరమేష్ అన్నారు. ప్రతి ఒక్క ఆర్యవైశ్య విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలి,ఆర్యవైశ్యలు పేరు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు ఒరుగంటి రామకృష్ణ, ఒరుగంటి సురేష్,వేముల సునీల్,మంచిగంటి మురళి,గాధంశెట్టి మధు,కోట రమేష్ ,చెన్న కొండల రావు,సోమిశెట్టి ఉమ,సందీప్,గాధంశెట్టి వంశీ ,విద్యార్థులు పాల్గొన్నారు.



# బుజ్జి కన్నా అంటూ బుట్టలో వేస్తున్నారా?



'లవ్ టుడే'తో టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. 'లవ్ టుడే'తో టాలీవుడ్ కి పరిచయమైన యంగ్ బ్యూటీ ఇవానా గురించి చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే అమ్మడు యువత అటెన్షన్ డ్రా చేసింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీ తో కుర్ర కారులో క్రేజీ బ్యూటీగా మారిపోయింది. వైవిధ్యమైన హవభావాలతో ప్రేక్షకులకు దగ్గరైంది. తాజాగా అమ్మడు 'సింగిల్' అనే సినిమాతో తెలుగులోనూ లాంచ్ అవుతుంది. ఇందులో శ్రీవిష్ణుకు జోడీగా నటించింది. తొలి సినిమానే ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ లో అవకాశం రావడంపై సంతోషం వ్యక్తం చేసింది. అలాగే తెలుగు కుర్రాళ్లు తనని ఎలా పిలుస్తారో కూడా గుర్తు చేసుకుంది. 'హైదరాబాద్ కి ఎప్పుడొచ్చినా ఇక్కడ ఆడియన్స్ అంతా బుజ్జి, కన్నా అంటూ పిలుస్తున్నారు. బహుశా లవ్ టుడే లో నేను పోషించిన పాత్ర ప్రభావం అనుకుంటా. అలా పిలవడం నాకెంతో సంతోషాన్నిస్తుంది. తొలి సినిమాతోనే నన్ను గుర్తు పెట్టుకుని అలా పిలిచారంటే నన్నెంత అభిమానిస్తున్నారు? అన్నది అర్దమవుతుంది. 'సింగిల్' సెట్ లో వీలైనంత వరకూ తెలుగులోనే మాట్లాడటానికి ప్రయత్నించా. భాష పూర్తిగా నేర్చుకోవాలి. తెలుగు చాలా అందమైన భాష' అంటోంది. నటిగా ఇవానా కెరీర్ మాలీవుడ్ లో మొదలైంది. 'మాస్టర్స్' సినిమాతో నటిగా ప్రయాణం మొదలు పెట్టింది. అటుపై మాలీవుడ్ లో రెండు మూడు సినిమాలు చేసి సక్సెస్ లు అందుకుంది. అనంతరం అమ్మడు కోలీవుడ్ కి ప్రమోట్ అయింది. కోలీవుడ్ లో రెండు సినిమాల తర్వాత లవ్ టుడే%-%లో నటించింది. ఈ సినిమా మంచి విజయంసాధించ దంతో తమిళ్ తో పాటు తెలుగులోనూ గుర్తింపు దక్కింది. ఆ మధ్య రిలీజ్ అయిన %-%డ్రాగన్%-% లోనూ గెస్ట్ రోల్ పోషించింది. కనిపించింది కొన్ని నిమిషాలైనా ఇవానా రాకతో థియేటర్లు ఒక్కసారిగా మోతెక్కాయి. %-%లవ్ టుడే%-% కాంబినేషన్ మళ్లీ స్క్రీన్ పై కనిపించడంతోనే ఆ రేంజ్ లో రెస్పాన్స్ వచ్చింది.

# బన్నీ-అట్లీ సినిమాపై పెరుగుతున్న అంచనాలు





పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు హీరోలు తీస్తున్న సినిమాలు చిత్రసీమను షేక్ చేస్తున్నాయి. హాలీవుడ్ లెవెల్ యాక్షన్ హంగులు ఉన్న భారీ సెట్టింగ్స్, ఇలా ఎన్నెన్నో సినిమాలు ఇండియన్ సినిమా దగ్గర నుంచి వస్తున్నాయి. ఇక అలా ఇండియన్ సినిమా నుంచి రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లెవెల్లో అనౌన్స్ అయిన సినిమా ఏదైనా ఉంది అంటే.. అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ అని చెప్పవచ్చు. కాగా ఈ చిత్రం అనౌన్స్ చేసినపుడే అందులో విజువల్స్ చూసి హాలీవుడ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్టు- అర్థం అవుతుంది. అయితే ఈ మూవీలో బన్ని మొత్తం మూడు పాత్రలు పోషించనున్నాని తెలుస్తోంది. ఇందుకోసం చాలా కసరత్తులు చేస్తున్నాడట. ఇక ఈ సినిమాతో విజువల్ ఎఫెక్ట్స్ పరంగా ఆడియెన్స్‌ని ఖచ్చితంగా మరో లోకం లోకి తీసుకెళ్ళడానికి బన్నీ ఇంకా అట్లీ- ఇద్దరు గట్టిగా ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే ఈ రెంజ్ మూవీ కోసం యాక్టర్స్‌ని ఎంచుకోవడం ఒక్కింత కష్టం అనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి ఒక్క పాత్ర చాలా ముఖ్యం. అందుకే ఇప్పటిక వరకు ఈ మూవీలో నటనటు-ల గురించి ఎలాంటి అప్ డేట్‌లు రావడంలేదు. కానీ తాజాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్‌ను డిజైన్ చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈ పాత్రలో ఓ బాలీవుడ్ హీరోని తీసుకునే ఆలోచనలో మూవీ టీ-ం ఉన్నట్లు- సమాచారం. మరి ఆ హీరో ఎవరు అనేది చూడాలి. ప్రజంట్ టాలీవుడ్ బారీ చిత్రాల్లో ఒక్కరైనా బాలీవుడ్ యాక్టర్స్ కచ్చితంగా ఉంటున్నారు. మరి ఈ మూవీలో ఎవరు రాబోతున్నారు చూడాలి.

# హరిహర వీరమల్లు షూటింగ్ బిజీలో పవన్ కళ్యాణ్



'హరి హర వీరమల్లు'ను ముగించేందుకు కథానాయకుడు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఆయన -టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరుకోగా.. ఆఖరి షెడ్యూల్ కోసం పవన్ ఆదివారం సెట్లోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు- ఈ చిత్రీకరణ కొనసాగనుంది. దీనిలో భాగంగా పవన్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించి.. 6వ తేదీతో సినిమాకి గుమ్మడికాయ కొట్టనున్నారు. ఆ వెంటనే చిత్రబృందం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో జరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇందులో నిధి అగర్వాల్ (కథ ఆగశసూశ) కథానాయికగా నటిస్తుండగా.. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్. నిర్మాత: ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ.ఎం.రత్నం.

# బుట్టబొమ్మని గట్టెక్కించేది ఆ ఇద్దరేనా?



ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఇలియానా, శ్రీలీల ఇప్పుడు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ముగ్గురు టాలీవుడ్‌లో ఎంత స్పీడుగా ఎదిగారో అంతే స్పీడుగా ఫ్లాపుల్ని ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. దానికి కారణం వారు ఎంచుకున్న సినిమాలే. ఇలియాన రాకెట్ స్పీడుతో ఎదిగి అంతే స్పీడ్‌తో తెరమరుగైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితిని బుట్టబొమ్మ పూజాహెగ్డే ఎదుర్కొంటోంది. %-%డీజే దువ్వాడ జగన్నాథం%-% మూవీతో బిగ్ డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించిన పూజా హెగ్డే అనతికాలంలోనే వరుసగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. బన్నీ అలవైకుంఠపురం%-% వరకు అదే హవాని కొనసాగిస్తూ భారీగా డిమాండ్ చేసిన పూజా హెగ్డే ఆ తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా ఎదురీదుతోంది. రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, బాలీవుడ్‌లో సర్కస్, కిసీకి భాయ్ కిసీకి జాన్, దేవ వంటి సినిమాలతో వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొని షాక్ ఇచ్చింది. ఈ సినిమాలతో పూజా హెగ్డే వరుసగా రికార్డు స్థాయిలో 7 ఫ్లాపుల్ని దక్కించుకోవడం గమనార్హం. తాజాగా సూర్య, కార్తీక్ సుబ్బరాజ్‌ల %-%రెట్రో%-%తోనూ ఫ్లాప్‌ని ఎదుర్కోవడంతో బుట్టబొమ్మ కెరీర్ ఇక అంతేనా అనే అనుమానాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో పూజా హెగ్డేకు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో అవకాశాలు తగ్గే అవకాశం ఉందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తనని, తన కెరీర్ ని కాపాడేది ఆ ఇద్దరే అనే చర్చ మొదలైంది. ఆ ఇద్దరు దళపతి విజయ్, రాఘవ లారెన్స్. విజయ్ తన చివరి సినిమా %-%జన నాయగన్% చేస్తున్న విషయం తెలిసిందే. హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో విజయ్‌కి జోడీగా బుట్టబొమ్మ నటిస్తోంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా ఫలితంపైనే పూజా హెగ్డే కెరీర్ ఆధారపడి ఉంది. ఇక ఈ మూవీ తరువాత పూజా హెగ్డే హారర్ థ్రిల్లర్ %-%కాంచన 4%-%లో నటిస్తోంది. %-%కాంచన%-% ఫ్రాంచైజీలో భాగంగా రాఠవ లారెన్స్ రూపొందిస్తున్న ఈ మూవీ కూడా పూజా హెగ్డేకు కీలకంగా మారింది. తొలి సారి తను చేస్తున్న హారర్ థ్రిల్లర్ కావడం, కాంచన సీక్వెల్ కావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. బుట్టబొమ్మకు ఈ రెండు సినిమాలు హిట్ ని అందిస్తే మరిన్ని సినిమాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఇక కెరీర్ ముగిసినట్టే అని ఇన్ సైడ్ టాక్.

## ఊరమాస్ లుక్‌లో సుహస్

నటుడు సుహాస్ ఈ నడుమ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. తాజాగా ఆయన నటిస్తున్న మూవీ మండాడి. కోలీవుడ్ నటుడు సూరితో కలిసి ఈ సినిమా చేస్తున్నాడు. తమిళ డైరెక్టర్ మతిమారన్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. తాజాగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో సుహాస్ ఊరమాస్ లుక్ లో వైల్డ్ గా కనిపిస్తున్నాడు. గడ్డం, పొడవాటి జుట్టు-తో రగ్డ్ లుక్ లో ఉన్నాడు. పైగా టీ-షర్టు, లుంగీలో కనిపిస్తున్నాడు. ఇది విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్నట్టు- తెలుస్తోంది. టీ-షర్టు మీద టీ-సునామీ రైడర్స్ అని రాసి ఉంది. ఇదేదో కబడ్డి ఆట నేపథ్యంలో సాగుతున్నట్టు- ఉంది. ఇంకో పోస్టర్ లో సూరి, సుహాస్ సముద్రంపై పడవల్లో సీరియస్ లుక్ లో కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్ ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. సుహాస్ ఇలాంటి సీరియస్ లుక్ లో ఇప్పటి వరకు కనిపించలేదు. ఇంత రగ్డ్ లుక్ తో కనిపిస్తుండటంతో ఈ మూవీపై ఒక్కసారిగా హైప్ పెరుగుతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా గురించి టాలీవుడ్ లో పెద్దగా తెలియదు. కానీ ఈ ఒక్క పోస్టర్ తోనే టాలీవుడ్ అ-టె-న్షన్ మొత్తం తనవైపు మళ్లించుకున్నాడు సుహాస్. మంచి కథలు ఎంచుకునే ఈ హీరో.. ఈ మండాడిలో ఇంకెలా ఉంటాడో అని అంతా వెయిట్ చేస్తున్నారు.




Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.www.sai suryaadaily.com.